
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 5
జిల్లాల వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024



23న 'ఈశా' క్రీడోత్సవం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 23న సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో అతి పెద్ద క్రీడోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ఖాసింబేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్, డివిజనల్, ఫైనల్ మూడు దశల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు మెరిట్ సర్టిఫికెట్, నగదు బహుమతి, అలాగే మొదటి రెండు జట్లకు ఈశా రిజువినేషన్ ట్రోఫీని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

కాకిపడగలు.. మహాభారత కథకులు

సండే స్పెషల్
Sunday Special

'శ్రీపార్వతీశుండయా.. శ్రీవల్లంభుండయా దీవించు ఓ గంగా.. బావిడుపు గంగా గంగపై జగమందు వెలిసినావమ్మా మాకు వాక్కియ్యవే నలినామాకాక్షి ఒప్పగా ఈ కథ చెప్పబూనినాము' అంటూ గంగమ్మను తలుస్తూ రాగయుక్తంగా కథను మొదలు పెడతారు కాకిపడగల వారు. చేతిలో హార్మోనియం, మద్దెలు, తాళాలు మోగుతుండగా.. పాత్రకు తగిన వేషధారణతో, కాళ్ల గజ్జెల చప్పుడు చేస్తూ, రాగమెత్తి ముదిరాజ్‌ల గొప్పతనాన్ని గానం చేస్తారు. ఈరోజుల్లో కనుమరుగవుతున్న కాకిపడగల వృత్తిని ఇంకా అక్కడక్కడ కొందరు నమ్ముకుని జీవిస్తున్నారు. సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందజేస్తున్నారు.

- భారతంలోని ముదిరాజ్‌ల చరిత్రను గానం చేసే కులస్థులు
- వారిచ్చే ప్రతిఫలంతోనే బతుకుదెరువు
- వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న పలువురు
- కథాగానం కోసం ఎనిమిది నెలల సంచార జీవితం

7



వేషధారణలో కాకిపడగలు



ప్రదర్శన చేస్తున్న కాకిపడగలు

ప్రతీ పేషెంట్‌కు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

- రోగి సమాచారం.. ఆన్‌లైన్‌లో నిక్షిప్తం
- ఈ హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో సమగ్ర వివరాలు
- పైలెట్ ప్రాజెక్టుగా సంగారెడ్డి జిల్లా
- తొలుత 17 ఆరోగ్య కేంద్రాల్లో అమలు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్స కోసం వచ్చే రోగుల సమగ్ర సమాచారాన్ని సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడంతో పాటు ప్రతీ రోగికి ఓ గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నారు. ఇందుకోసం సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 బస్తీ దవాఖానాలను ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఆయా ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఇప్పటికే సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆభా(ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) యాప్ ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ముందడుగు వేసిన ఆరోగ్య శాఖ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలను సైతం ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(ఈహెచ్‌ఎంఐఎస్) పోర్టల్‌లో రోగుల వివరాలు, చేసిన పరీక్షలు, డాక్టర్ అందించే చికిత్స, మందుల వివరాలు నిక్షిప్తం చేసి చివరికి ఓ గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నారు. దీంతో వైద్యం కోసం ఏ ఆస్పత్రికి వెళ్లినా పాత మెడికల్ రిపోర్టులు చూపించాల్సిన పని లేకుండా కేవలం ఆన్‌లైన్‌లో నమోదైన గుర్తింపు, లేదా ఆధార్ నంబర్ చెబితే సరిపోతుందని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే మున్ముందు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని వైద్య అధికారులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురి దుర్మరణం

- మృతులు హైదరాబాద్‌లోని సురారానికి చెందినవారు
- ప్రమాదంలో ఒకరికి గాయాలు

శివాయపల్లి శివారులో ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

బొడ్మాట్‌పల్లి శివారులో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మహిళ మృత్యువాత

7



కార్తీక పూజలు

శివ్వంపేట మండలం చాకరిమెట్లలోని సహకార ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెద్దఎత్తున దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నారు.

- శివ్వంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డిలోని ఎస్‌పీ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సర్వం సిద్ధం

రెండు రోజులు గ్రూప్-3 పరీక్షలు

- నేడు రెండు పేపర్‌ల నిర్వహణ
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందే గేటుకు తాళం
- సంగారెడ్డి జిల్లాలో 49 కేంద్రాలు.. 15,163 మంది అభ్యర్థులు
- మెదక్ జిల్లాలో 5,867 మంది అభ్యర్థులకు 19 కేంద్రాల ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రెండు రోజుల పాటు కొనసాగనున్న పరీక్షలకు మెదక్, సంగారెడ్డి జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. సంగారెడ్డి జిల్లాలో పరీక్ష రాయనున్న 15,163 మంది అభ్యర్థుల కోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో 19 కేంద్రాల్లో 5,867 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. 17, 18వ తేదీల్లో మూడు పేపర్‌లుగా పరీక్ష నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు పేపర్-2 హిస్టరీ, పాలిటీ అండ్ సోషల్ పరీక్షలు కొనసాగుతాయి. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష జరగనున్నది. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించి గేట్లకు తాళాలు వేస్తామని అధికారులు వెల్లడించారు. తర్వాత ఎవరు వచ్చినా అనుమతించరు. పరీక్ష సమయానికి రెండు గంటల ముందే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్

మిగతా 8వ పేజీలో

రోజూ ఏడెనిమిది ఇళ్లల్లోనే సర్వే

- ఒక్కో కుటుంబానికి ముప్పావుగంట సమయం
- రెండంకెలు చేరడం లేదని ఎన్యూమరేటర్ల ఆవేదన
- ఈనెల 20లోగా కులగణన పూర్తయ్యేనా?

మెదక్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సర్వే జిల్లాలో కొనసాగుతూ ఉంది. ఎన్యూమరేటర్లు ఒక్కో కుటుంబానికి ప్రశ్నలు వేస్తూ సమాచారం నమోదు చేయడానికి ముప్పావు గంట నుంచి గంట వరకు సమయం పడుతోంది. రోజుకు ఏడెనిమిది ఇళ్లను పూర్తి చేయడమే కష్టంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు మాత్రం కనీసం పది ఇళ్లయినా సర్వే చేయాలని సూచిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పని నిమిత్తం పైఅధికారులు ఫోన్ చేస్తే సర్వే మధ్యలోనే వెళ్లిపోతునట్లు ఆరోపణలు వస్తున్నాయి. మెదక్ జిల్లాలో మొత్తం 2,18,390 కుటుంబాల సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. 1674 మంది ఎన్యూమరేటర్లు, 1374 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారు. శనివారం వరకు జిల్లావ్యాప్తంగా 1,02,185 కుటుంబాలను సమాచారం సేకరించారు. 46 శాతం సర్వే పూర్తి చేసినట్లు ముఖ్య ప్రణాళికా శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 20 తేదీ వరకు సర్వే 100 శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఆలోగా లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమే. అక్కడక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. వారు ముందే గుర్తించిన ఇళ్లకు వెళ్తున్నప్పటికీ యజమానులు అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ ఉన్నా.. వివరాలు వెల్లడించడానికి ఇష్టపడడం లేదు. మరికొందరు బ్యాంకుల్లో రుణాలు, ఆస్తులు, బ్యాంక్ బ్యాలెన్స్ వంటి సమాచారం చెప్పడానికి నిరాకరిస్తున్నారు. ఆధార్ కార్డుతో సమస్త సమాచారం లింక్ అవడం మూలంగా ఆధార్ వివరాలు ఇచ్చేందుకు సందేహిస్తున్నారు. ఎన్యూమరేటర్లు వారికి నచ్చజెప్పాల్సి వస్తోంది.



వెల్దుర్తిలో సర్వే పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం
- కొత్లాపూర్ బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఘటన
- కూతురి మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రుల ఫిర్యాదు
- సంగారెడ్డి ఆస్పత్రి వద్ద సీపీఐ, విద్యార్థి సంఘాల నేతల ఆందోళన



స్వాతి(ఫైల్)

సంగారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం కొత్లాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని శనివారం ఆత్మహత్య చేసుకుంది. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న స్వాతి(14) అనే బాలిక ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఏపీలోని గుంటూరుకు చెందిన పాండురాజ్, దివ్యవాణి దంపతుల చిన్న కుమార్తె స్వాతి.. కొత్లాపూర్ గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతుంది. పాండురాజ్ దంపతులు సదాశివపేటలో ఉంటూ హైదరాబాద్, మదీనగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి పెద్ద కుమార్తె పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. కాగా, ఎప్పట్లాగే శనివారం ఉదయం 6 గంటలకు పాఠశాలలో జరిగే ప్రార్థనలో పాల్గొన్న తర్వాత హాస్టల్‌లోని తన గదికి వెళ్లిన స్వాతి ఎంతసేపటికి తిరిగి రాలేదు. దీంతో తోటి విద్యార్థినులు ఆమె కోసం వెళ్లగా తలుపు లోపలి నుంచి గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా స్వాతి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు స్వాతిని వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. బాలిక అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వాతి మృతిపై పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికి వ్యక్తి కాదని, స్వాతి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు తెలిపారు. ఈ మేరకు వారి నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబంతో కలిసి సీపీఐ, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తగిన న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. విద్యార్థిని కుటుంబానికి రూ.2 లక్షలు, అంత్యక్రియలకు రూ.50వేలు ఇచ్చేందుకు ఆర్డీవో రవీందర్‌రెడ్డి, గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ తిరుపతి అంగీకరించారు. కాగా, మానసిక ఒత్తిడితోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశముందని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ తెలిపారు.

60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, నవంబరు16(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 60వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం ఆయన వెల్దుర్తి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలో సమగ్ర సర్వే తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వారం రోజుల నుంచి రోజుకు 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రతీ రైస్ మిల్లర్ 25శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉండగా, చాలా మంది ముందుకు రాలేరని తెలిపారు. ప్రస్తుతం ధాన్యం నిల్వకు 73 రైస్‌మిల్లులు అందుబాటులో ఉన్నాయన్నారు. తహసీల్దార్లు రైస్‌మిల్లులను పరిశీలించాలని ఆదేశించారు. ధాన్యంను అన్‌లోడింగ్ చేసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో 490 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో 90 సన్నవడ్ల కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రైతులు పండించిన దొడ్డు, సన్నవడ్లను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో 2లక్షల 20వేల కుటుంబాలు ఉన్నాయని, ఇప్పటివరకు 50 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- మిషన్ భగీరథ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డిలోని ఆయన నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగునీటి వసతి కల్పించాలన్నారు. భగీరథ ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్, నీటి సరఫరా చెయిన్‌కు సంబంధించి మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలను చెల్లించాలని సూచించారు. నెలాఖరులోగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను పరిశీలిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


కనకయ్య మృతదేహం

పుల్‌కల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా పుల్‌కల్ మండలం మిన్‌పూర్ గ్రామానికి చెందిన చాకలి కనకయ్య(40)కు అందోల్ మండలం తాలెల్మ గ్రామానికి చెందిన కవితతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో కొన్నినెలల నుంచి భార్య కవిత పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన కనకయ్య పొలం పనులకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి వెళ్లి.. పుల్కల్ గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం పొలం పనులకు వెళ్తున్న రైతులు గమనించి గ్రామస్థులకు సమాచారమందించారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పుల్కల్ పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఆర్థోపెడిక్ సేవలు

మెదక్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మెదక్ ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్య కళాశాల సౌజన్యంతో ఆర్థోపెడిక్ ఆరోగ్య సంరక్షణ సేవలు ప్రారంభమయ్యాయి. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా మెదక్ పట్టణ, చుట్టుపక్కన ప్రాంతాల రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. విరిగిన ఎముకల నుంచి క్లిష్ట ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల వరకూ జిల్లా ఆస్పత్రిలో చేయనున్నారు. ఆర్థోపెడిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చుట్టుపక్కల గ్రామాల్లో సాధారణ ఆరోగ్య శిబిరాలు, స్ర్కీనింగ్‌లు, ఫాలో అప్ సెషన్ల ద్వారా రోగ నిర్ధారణతో పాటు చికిత్సలు అందిస్తున్నట్లు వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ తెలిపారు. ఈ పథకం కింద జిల్లా ఆస్పత్రిలో జాయింట్ రీప్లేస్‌మెంట్, వెన్నెముక శస్త్రచికిత్సలు, ట్రామా మేనేజ్‌మెంట్, క్లిష్టమైన ఎముక విరుగుళ్ల వంటి పలురకాల ఆర్థోపెడిక్ కేసులను సమర్థవంతంగా నిర్వహిస్తూ చికిత్సలు అందజేస్తున్నామని చెప్పారు.


వైద్యానికి సంబంధించిన అప్రూవల్ పత్రం అందజేస్తున్న వైద్యులు

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

● సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీచంద్ర కోరారు. సంగారెడ్డి జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం జిల్లా పోలీసు, ఎక్సైజ్ అధికారులు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిమినల్, ఎక్సైజ్ సంబంధించిన కేసులను రాజీమార్గంలో పరిష్కరించి కక్షిదారులకు సమన్యాయం చేయాలని కోరారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ వారీగా ఎన్ని క్రిమినల్ కాంపౌండ్ టేబుల్ కేసులు, ఎక్సైజ్ కేసులు పరిష్కరిస్తారో ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో న్యాయాధికారులు జయంతి, సునీతారవీంద్రారెడ్డి, జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి బీ.రమేష్, న్యాయాధికారులు ధనలక్ష్మి, తేజశ్రీ, ప్రభుత్వ న్యాయవాది ప్రభుదాస్యం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొన్న కారు... ముగ్గురి దుర్మరణం

● మృతులు హైదరాబాద్‌లోని సురారానికి చెందినవారు
● ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు



నర్సింహారావు (ఫైల్)



సురేష్(ఫైల్)

జహీరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : కారు డివైడర్‌కు ఢీకొట్టడంతో ముగ్గురు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని సురారం ప్రాంతం శివాలయం కాలనీకి చెందిన నర్సింహారావు(45), ఆయన కుమారుడు మనోజ్‌కుమార్(13), స్నేహితులు సురేష్(35), శివకుమార్(40) మహారాష్ట్రలోని గాణ్‌గాపూర్‌కు దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భాగంగా శుక్రవారం రాత్రి మహారాష్ట్ర నుంచి బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున 65వ నంబర్ జాతీయ రహదారిపై జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుండగా, నిద్రమత్తులో ఇంద్రప్రస్థాన్ వద్ద పక్కనే ఉన్న డివైడర్‌ను అతివేగంతో ఢీకొట్టారు. దీంతో నర్సింహరావు అక్కడిక్కడే మృతిచెందగా, సురేష్, శివకుమార్, మనోజ్‌కుమార్ తీవ్ర గాయాలపాలయ్యారు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను మొదటగా జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ సురేష్ మృతిచెందాడు. శివకుమార్, మనోజ్‌కుమార్‌ల ఆరోగ్యపరిస్థితి బాగలేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటుకు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శివకుమార్ కూడా మృతిచెందారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి



బీరప్ప(ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట గ్రామానికి చెందిన కురుమ గొల్ల బీరప్ప(40) వరిధాన్యాన్ని శివాయపల్లి గ్రామ సమీపంలోని రైస్‌మిల్లులో విక్రయించడానికి తన సొంత ట్రాక్టర్‌లో అతని స్నేహితుడు దేవయ్యతో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి బీరప్ప కిందపడి మృతి చెందాడు. కొలకొండ దేవయ్య గోసాయిపల్లి వీరయ్య మద్యం తాగి ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడపడంతోనే తన భర్త కిందపడి మృతిచెందాడని భార్య మల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మహిళ..

టేక్మాల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామ శివారులో 161 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్మాట్‌పల్లి గ్రామానికి చెందిన భవాని సత్యమ్మ(35) శనివారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తూ రోడ్డు దాటుతున్న క్రమంలో అతి వేగంగా వస్తున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నారు. సంఘటన స్థలానికి అల్లాదర్గం సీఐ రేణుక , టేక్మాల్ ఎస్ఐ రాజేష్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సండే స్పెషల్

కాకిపడగలు.. మహాభారత కథకులు

జగదేవ్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాకాసురుడు(మాయ కాకి) అనే రాక్షసుడుని గెలిచిన బాలకుడు ఈ విషయం తన తల్లిదండ్రులైన జమ్మూకేశ్వర మహారాజు, సూర్యమహదేవికి చెప్పేందుకు ఇంటికి వెళతాడు. తనతో తీసుకెళ్లిన కాకిని ఏడంతుస్థుల ఇంటిపై తన తండ్రి కట్టించిన నాగ పడగ కింద ఉంచుతాడు. అప్పుడు బాలకుడు తల్లి పడిగె నీడన కాకిని ఉంచి అపవిత్రం చేసినందున నువ్వు 'కాకిపడిగెల' వాడివైపొమ్మని శపిస్తుంది. కోపం చల్లారిన తరువాత తల్లి సూర్యమహదేవి నా ఇంట్లో పుట్టిన వాడివి కాబట్టి నా అర్ధ బిడ్డవై భారత కథలు చెప్పుకుంటూ వచ్చే ప్రతిఫలంతో జీవించమంటుంది. వారి సంతతియే కాకిపడగల కులస్థులని కథ. నాటి నుంచి మహాభారత కథను గానం చేస్తున్నామని కాకిపడగలు చెబుతున్నారు. వారి పూర్వీకులైన ముదిరాజుల చరిత్రను చెబుతుంటారు. మహాభారతంలో వారి ప్రస్తావనను జానపద కథరూపకం ద్వారా గానం చేస్తారు. చెబుతున్నారు. ఇదే వృత్తిగా జీవిస్తున్న కళాకారులు ఈ కాకిపడగలు.



ప్రదర్శన చేస్తున్న కాకిపడగలు(ఫైల్)

- భారతంలోని ముదిరాజ్‌ల చరిత్రను గానం చేసే కులస్థులు
- వారిచ్చే ప్రతిఫలంతోనే బతుకుదెరువు
- వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న పలువురు
- ఎనిమిది నెలలు సంచార జీవితం



వేషధారణలో కాకిపడగలు

సంవత్సరంలో ఎనిమిది నెలలు గ్రామాల్లో పర్యటిస్తూ కాకిపడగలు కథలు చెప్తారు. దీపావళి పండుగ తరువాత నుంచి రోహిణీ కార్తె వరకు వారికి హక్కుగా వచ్చే గ్రామాల్లో పర్యటిస్తూ కథలు చెబుతారు. ముదిరాజ్ కులస్థులకు ఆశ్రిత కులమైన వీరు ముదిరాజుల పుట్టుక, మహాభారతంలో వారి ప్రస్తావనను గానం చేస్తారు. ఇందుకు ముదిరాజులు అందించే ప్రతి ఫలాన్ని స్వీకరిస్తారు. కేవలం తమ పోషకుల కుల పురాణాన్ని మాత్రమే గానం చేస్తారు. వర్షాకాలం ప్రవేశించగానే స్వస్థలాలకు చేరుకుని మిగిలిన నాలుగు నెలలు వాయిద్యాలకు, వస్త్రాలకు మరమ్మతు చేసుకుంటారు. కాకి పడగల కథకులకు ప్రత్యేకంగా గురువులు ఉండరు. తాతముత్తాతలు, పెద్దలే వారి గురువులు. చిన్నప్పటి నుంచే కథలు చెప్పే బృందంలో భాగస్వాములం కావడంతో ఈ కళ అలవడుతుంది. తాళం కొట్టడంతో కులవృత్తిని ప్రారంభిస్తారు. అనంతరం వయసుతో పాటు తబలా, హార్మోనియం వాయిస్తూ కథకులకు కోరస్ అందిస్తుంటారు. అలా మెల్లమెల్లగా కథ నేర్చుకుంటారు. కథలకు సంబంధించి పెద్దలు రాసిన పుస్తకాలు చదువుతుంటారు.

రూ.20 వేల వరకు గిట్టుబాటు

ఒక గ్రామంలో కథ చెప్పాలంటే రూ.30 వేల నుంచి రూ.50 వరకు ఖర్చవుతుంది. వేషధారణతో కథను గానం చేసే బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. ఖర్చులు పోనూ రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. కథ చెప్పడమే అలవాటుగా మారిన వారికి వేరే పనులు అంతగా రావు. కథలు చెప్పినప్పుడు మిగిలిన డబ్బుతోనే నాలుగు నెలలు జీవనం సాగించాల్సి వస్తుంది.

సంచార కులాలుగా గుర్తించాలి

మాది సిద్దిపేట జిల్లా తొగుట మండలం రాంపూర్ గ్రామం. మా తాతలు ముగ్గురు అన్నదమ్ములు. వారి పిల్లలందరూ కాకిపడగల వృత్తినే కొనసాగిస్తున్నాం. మాకు 'వతన్' (వారసత్వంగా వచ్చిన హక్కు) ఉన్న గ్రామాల్లో ముదిరాజ్ కథలు చెబుతుంటాం. మా తాత సంతతి వివిధ ప్రాంతాలకు వలస వెళ్లగా, మేము ఇద్దరం అన్నదమ్ములం జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ గ్రామంలో స్థిరపడ్డాం. మేము మహాభారతంలోని 18 పర్వాలను ఐదు రోజుల్లో గానం చేస్తాం. భారతంలో ముదిరాజు జంపన్నకు సంబంధించిన కథను ప్రధానంగా వినిపిస్తాం. మా ప్రదర్శన ఆది పర్వం నుంచి మొదలవుతుంది. ఆదిశక్తి పుట్టినప్పటి నుంచి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల పుట్టుక తదనంతర విశేషాలతో కథను వివరిస్తాం. ముదిరాజుల ఘట్టాన్ని మినహాయిస్తే కథలో భీముడు పాడింబిని పరిణయమాడే ఘట్టం ప్రధానంగా నిలుస్తుంది. ఐదు రోజుల పాటు జరిగే కథలో ఈ కథకు ఆదరణ ఎక్కువగా ఉంటుంది. కాకిపడగలను సంచార కులాలుగా ప్రభుత్వం గుర్తించాలి. ఇప్పటికీ కుల ధ్రువీకరణ పత్రాలు ముదిరాజుగానే ఇస్తున్నారు. మాకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి.

- వెంకటేశం, మాందాపూర్, జగదేవ్‌పూర్ మండలం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

● ఉమ్మడి జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఈవో రాధాకిషన్, ఆర్గనైజింగ్ సభ్యులు

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల గ్రౌండ్‌లో శనివారం రాష్ట్రస్థాయి అండర్ 14 బాలబాలికల వాలీబాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సందర్భంగా జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ రాంరెడ్డి, జిల్లా సెక్రటరీ గంగాల రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లి నరేష్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పరంజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, అథ్లెటిక్ జిల్లా సెక్రటరీ మధుసూదన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గణేష్ రవికుమార్, ఎంఈవో నీరజ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, వివధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సిద్దిపేట విద్యార్థి



మణిప్రసాద్‌ను సన్మానిస్తున్న డీఐఈవో రవీందర్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మణిప్రసాద్ ఎస్జీఎఫ్ అండర్ 19 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా డీఐఈవో రవీందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారయణ రెడ్డి, ఎస్జీఎఫ్ స్పోర్ట్స్ జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్ మణిప్రసాద్‌ను అభినందించి, శాలువాతో సత్కరించారు. చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

కళారంగంలో రాజగోపాల్‌పేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నంగునూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కళారంగంలో నంగునూరు మండలం రాజగోపాలపేట హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు శనివారం పాఠశాల ఆవరణలో వారికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కనకయ్య మాట్లాడుతూ బాలల దినోత్సవంలో భాగంగా హైదరాబద్‌లోని రామానుజారావు కళామందిరంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు పుస్తక సమీక్ష విభాగంలో ఏ.రమ్య, పాటల పోటీలో ఏ.రాజేశ్వరి, చిత్రలేఖనంలో ఏ. వైష్ణవి, వచన కవిత్వ విభాగంలో కే.వినీత్ విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. కళలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కృషి చేసిన ఉపాధ్యాయురాలు శ్రీలలితను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాలాంజనేయులు, సతీశ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, శంకర్, ఖాదర్ బాబా, తిరుపతి, మురళీకృష్ణ, శ్రీలత, జ్యోతి పాల్గొన్నారు.

భక్త జనం.. రాత్రంతా జాగారం

● హోమం, పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

జగదేవ్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని జగదేవ్‌పూర్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామంలోని రామునిబండ ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు రెండవ రోజూ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వచ్చిన భక్తులు రాత్రి ఆలయ వద్దనే జాగారం చేశారు. శనివారం కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామివారిని దర్శనం కోసం పెద్ద ఎత్తున బారులుదీరారు. సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. పూర్ణాహుతితో రామాలయంలో కార్తీకమాస ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.



గుండంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థుల పరారీ

● గోడదూకి పారిపోయిన పదోతరగతి విద్యార్థులు
● ముగ్గురూ బొల్లారానికి చెందిన వారే..



అదృశ్యమైన విద్యార్థులు

జిన్నారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. బొల్లారం సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం పాఠశాల పదోతరగతి విద్యార్థులు మనోజ్‌కుమార్, అఖిల్, మల్లిఖార్జున్ శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాఠశాల ప్రహరీ గోడ దూకి పారిపోయారు. విద్యార్థులు స్థానికంగా నివాసం ఉండేవారు కావటంతో వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులను సంప్రదించగా రాలేదని తేలడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తలిపారు. విద్యార్థుల ఆచూకీ తెలిసినవారు 8712656729 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థుల ప్రవర్తనపై టీచర్లు, తల్లిదండ్రులు మందలించటమే వారు పారిపోవడానికి కారణమని తెలిసింది.

కోళ్లవ్యాన్ బీభత్సం

● అదుపుతప్పి స్కూల్ బస్సును ఢీకొట్టిన వాహనం
● బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు.. ● తప్పిన పెను ప్రమాదం

గజ్వేల్ రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో కోళ్ల వ్యాన్ బీభత్సం సృష్టించింది. గజ్వేల్ మండలం పిడిచెడ్ గ్రామం నుంచి జెన్ హెరిటేజ్ పాఠశాలకు చెందిన బస్సు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సిగ్నల్ వద్ద ప్రజ్ఞాపూర్ వైపు మళ్తుండగా, తూప్రాన్ వైపు నుంచి వస్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. ఈ క్రమంలో పాఠశాల బస్సు అదుపు తప్పి ట్రాఫిక్ కంట్రోలర్ కంటైనర్‌ను ఢీకొట్టింది. కోళ్ల వ్యాన్ అదుపు తప్పి రోడ్డు దాటి ప్రభుత్వాసుపత్రి ఎంట్రన్స్ వైపు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో పాఠశాల బస్ డ్రైవర్ రామోళ్ల నర్సింహులుకు తీవ్ర గాయాలు కాగా పాఠశాల ఆయా శారద, విద్యార్థిని ఈషితకు గాయాలయ్యాయి. కోళ్ల వ్యాన్ డ్రైవర్ ఉప్పరి నరేశ్ వ్యాన్ వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు.



ట్రాఫిక్ కంట్రోల్ కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

కూలీపై పిడిగుద్దులు..

కోపోద్రిక్తులైన స్థానికులను చూసి డ్రైవర్ నరేశ్ పరారయ్యాడు. అయితే అదే వ్యాన్‌లో ప్రయాణిస్తున్న కూలీ(కోళ్లను అన్‌లోడ్ చేసే పనివారు)ని డ్రైవర్‌గా భావించిన స్థానికులు పిడిగుద్దులు కురిపించారు.

తాజా మాజీ సర్పంచే ప్రధాన నిందితుడు

● యువకుడిపై హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు
● సుపారీ గ్యాంగ్‌తో అంతమొందించేందుకు కుట్ర
● వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

తొగుట, నవంబరు 16: తొగుట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో ఈనెల 11న మాజీ సర్పంచ్ కొడుకు రాజుపై హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. శనివారం సాయంత్రం తొగుట పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఈ కేసు వివరాలు వెల్లడించారు. గ్రామ మాజీ సర్పంచ్ పిట్ల శ్రీనివాస్ కొడుకు రాజు మల్లన్నసాగర్ నిర్వాసితులకు గ్రామంలో ఇచ్చిన ప్లాట్లలో అవకతవకలు జరిగినట్లు ఇటీవల సోషల్ మీడియాలో పోస్టుపెట్టారు. దీంతో గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొలిచెల్మ స్వామి, అతని తమ్ముడు కర్ణాకర్ ఎలాగైనా రాజును అడ్డుతొలగించాలని నిర్ణయించి అదే గ్రామానికి చెందిన కనకరాజును సంప్రదించారు. అతడు తన స్నేహితుడైన తుక్కాపూర్ గ్రామానికి చెందిన గండ్యాల నగేష్ అలియాస్ నర్సింహులుతో విషయం చెప్పగా, అతడు రాంపూర్ గ్రామానికి చెందిన జంగిటి భిక్షపతి, పెద్దమాసాన్‌సపల్లి గ్రామం ఇందిరానగర్‌కాలనీకి చెందిన కడారి సాగర్‌తో కలిసి రాజు హత్యకు పథకం రచించారు. సాగర్ స్నేహితులైన గణేష్, ఫిరోజ్, వాజిద్, మురళీకృష్ణలను రప్పించి ఈ నెల 11న సాయంత్రం లక్ష్మాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయబావి వద్దకు రాజును పిలిపించి బీరుబాటిళ్లు, కంకరరాళ్లతో దాడిచేయగా తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో చనిపోయాడని గ్రహించిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. కొంత సమయానికి రాజుకు మెళకువ వచ్చి రక్తగాయాలతో ఇంటికి చేరుకోవడంతో కుటుంబీకులు అతడిని చికిత్స కోసం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావు నేతృత్వంలో విచారణ చేపట్టి హత్యాయత్నం కేసులో ప్రమేయమున్న ఆరుగురి నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు తెలిపారు. సుపారీ గ్యాంగ్‌కు డబ్బులు సమకూర్చిన తాజా మాజీ సర్పంచ్ కొలిచెల్మ స్వామితో పాటు కడారి సాగర్, గణేష్, జంగిటి భిక్షపతి పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చీఫ్ కోఆర్డినేటర్‌గా నర్సింహాచారి



బండోజు నర్సింహాచారి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ చీఫ్ కోఆర్డినేటర్‌గా సిద్దిపేటకు చెందిన బండోజు నర్సింహాచారి నియమాకమైనట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చింతపట్ల వెంకటచారి తెలిపారు. తెలుగువారిలో ఉన్న ప్రతిభాపాటవాలు గుర్తించి వారికి ఒక గుర్తింపు తేవాలన్న ఉద్దేశంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థను ఏర్పాటు చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను తెలగువారి కట్టుబొట్టు, తెలుగు పండుగలకు ప్రాధాన్యతనిస్తూ ఈ వేదికగా రికార్డులు నిలుస్తున్నాయి. సంగీతం, సాహిత్యం, నృత్యం, క్రీడలు, యోగా వివిధ రంగాల్లో ప్రత్యేకంగా చేయగలిగిన వారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ నుంచి అవార్డులు అందజేస్తున్నారు.

ఈ స్థలం మాదే..

● మాల సదర్ సంఘం సభ్యుల ఆందోళన
● మున్సిపల్ బోర్డు తొలగింపు



పోలీసులతో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

సిద్దిపేట అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పట్టణంలో మోడ్రన్ బస్టాండ్ సమీపంలో ఫిషరీస్ కార్యాలయం వెనకాల ఉన్న ఖాళీ స్థలం తమదేనంటూ సిద్దిపేట మాల సదర్ సంఘం సభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎర్ర పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి గ్యాదరి వెంకటస్వామి మాట్లాడుతూ సర్వే నెంబరు 1551లోని మూడు గుంటల భూమిలో తమ పూర్వీకుల సమాధులు ఉండేవని తెలిపారు. ప్రస్తుతం అక్కడ 250 గజాల స్థలం మాత్రమే మిగిలిందని, ఆ స్థలాన్ని కూడా మున్సిపల్ అధికారులు బోర్డు పెట్టి కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలం తమ పూర్వీకుల నుంచి మాల సంఘం ఆధీనంలోనే ఉన్నదని చెప్పారు. అయితే జనవరిలో అక్కడున్న సమాధులను తొలగించడంతో గొడవలు జరిగాయని, సంబంధిత అధికారులు వచ్చి దీపావళి వరకు సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చినట్లు తెలిపారు. ఈ 10 నెలలకాలంగా అక్కడ మాల సదర్ సంఘం బోర్డును ఏర్పాటు చేశామని సభ్యులు పేర్కొన్నారు. దీపావళి వరకు సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు.. రెండురోజుల క్రితం ఈ స్థలం మున్సిపాలిటీకి చెందుతుందని బోర్డు పాతారన్నారు. దీంతో శనివారం మాల సదర్ సంఘం ఆధ్వర్యంలో సుమారు 400 మంది పురుషులు, మహిళలు కలిసి స్థలం వద్దకు చేరుకుని ఆందోళన చేసి బోర్డును తొలగించినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది, పోలీసులు స్థలం వద్దకు చేరుకోగా మాల సంఘం సభ్యులు విషయాన్ని పూర్తిగా వారికి వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి.. ఆ స్థలంపై హక్కు పత్రాన్ని సంఘానికి అందజేయాల్సిందిగా వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం సభ్యులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● 15 కేసులు నమోదు

వెల్దుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా గృహ, వ్యాపార, వాణిజ్య సంస్థల సర్వీసులను తనిఖీ చేసి, 15మంది వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. మండలంలో 11 బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. తూప్రాన్ విద్యుత్‌శాఖ డీఈ గరట్ మంతరాజు, ఏడీఈ శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పంట పొలాల వద్ద అడవిపందుల నుంచి రక్షణ కోసం రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో తూప్రాన్ డివిజన్ పరిధిలోని 11మంది విద్యుత్‌శాఖ ఏఈలు, లైన్ మెన్లు, సిబ్బంది ఉన్నారు.

మృతుల కుటుంబీకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మండలంలోని పోతన్‌పల్లి.ఆర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పరి నాగన్న శనివారం మృతి చెందారు. ఈ సమాచారమందుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను పరామర్శించి, ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలం గొందెగాంకు చెందిన బీంరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ శనివారం గ్రామానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు.

'రోడ్ల పనుల్లో నాణ్యత పాటించాలి'

జిన్నారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల ఏర్పాటులో నాణ్యత పాటించాలని మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీ 11వ వార్డులో చేపట్టిన సీసీ రహదారి పనులను కౌన్సిలర్ చంద్రారెడ్డి పరిశీలించారు. పనుల తీరును పరిశీలించి, నాణ్యతగా నిర్వహించాలని, నిబంధనల ప్రకారం మెటీరియల్ ఉపయోగించి పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను శనివారం డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బంది వివరాలు సేకరిస్తున్న తీరు, నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించి తగిన సూచనలు అందించారు.

'వ్యక్తిగత వివరాలు సేకరించవద్దు'

నాగల్‌గిద్ద, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ కుల గణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించవద్దని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గణపతి శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'సర్వే సక్రమంగా నిర్వహించడం లేదు'

మనూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని మనూరు మండల పరిధిలోని ఎల్గోయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అశోక్‌రావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉండగా, ఒకే చోట కూర్చొని, ఇష్టానుసారంగా సర్వే చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని, సమగ్ర కుటుంబ సర్వే సక్రమంగా నిర్వహించే విధంగా చూడాలని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటాం: ఏబీవీపీ

చేగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిబుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ జితేందర్ రెడ్డి, నాయకుడు పృథ్వీరాజ్ శనివారం డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బాసర ట్రిబుల్ ఐటీకి వెళ్తున్న క్రమంలో వడియారం రైల్వే స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడుతామని, బాధిత విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఏబీవీపీ సెక్రెటరీ వంశీగౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్. దుబ్బాక బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ చిలుకమర్రి గోవింద్. మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్, నాయకులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధిపై కరువైన చిత్తశుద్ధి

● నర్సాపూర్‌లో పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని డంపుయార్డు
● టన్నులకొద్దీ పేరుకుపోయిన వ్యర్థాలు
● దుర్గంధాన్ని వెదజల్లుతున్న పరిసరాలు
● అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం


డంపుయార్డు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త

నర్సాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పనులన్నీ పూర్తయ్యాయి, ఇక ప్రారంభమే తరువాయి అని భావిస్తున్న తరుణంలో మున్సిపల్ అధికారులు ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేయడంతో చెత్తశుద్ధి జరగక డంప్‌యార్డులో టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతున్నది. దీంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఏ మారుమూల ప్రాంతమో కాదు.. నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో ఈ దుస్థితి నెలకొన్నది.

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం

డంపుయార్డు నిర్మాణం పనులు 6 నెలల క్రితమే పూర్తయ్యాయి. అనివార్య కారణాల వల్ల కొంత ఆలస్యమైంది. త్వరలోనే డంపు యార్డును వినియోగంలోకి తెస్తాం.

- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

పేరుకుపోతున్న చెత్త

నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించి అక్కడ శుద్ధి చేసే విధంగా డంప్‌యార్డు నిర్మాణం పూర్తయిన దానిని ప్రారంభించకపోవడంతో యార్డు వద్ద పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయిన పట్టించుకునే వారు లేకుండా పోయారు. నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో 15వార్డులుండగా మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రతీ వార్డులో రోజూ చెత్త సేకరించడానికి ప్రత్యేకంగా ఎనిమిది వాహనాలు ఏర్పాటు చేసి ఉదయం ఇళ్లతో పాటు ఆయా వార్డులలో రోడ్డుపై ఉండే చెత్తను తీసుకుని రోజూ డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. ఇలా రోజు మున్సిపల్ పరిధిలో నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు చెత్త సేకరిస్తున్నారు. ప్రతీ శుక్రవారం జరిగే సంత రోజున పదిటన్నుల వరకు ఉంటుంది.

వినియోగంలోకి వచ్చేదెన్నడో?

ఇంత చెత్త రోజు డంప్‌యార్డుకు తీసుకెళ్లాక అక్కడ చెత్తను సేంద్రియ ఎరువు తయారు చేసేవిధంగా రూ.35లక్షలతో డంప్‌యార్డు నిర్మాణం చేశారు. అయితే మున్సిపల్ వారు ఎందుకో గాని ఇదిగో అదిగో అంటున్నారే తప్ప ప్రారంభించి వినియోగంలోకి తీసుకువద్దామన్న ఆలోచన చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే డంపుయార్డు వద్ద హానికారక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కేంద్రం కూడా రూ.25లక్షలతో నిర్మించారు. అయితే దానిని కూడా వినియోగించడం లేదు. దీంతో రోజు తెచ్చి ఇక్కడ మున్సిపల్ వాహనాలు చెత్తను వేస్తుండటంతో పెద్ద ఎత్తున పేరుకుపోయి ఈ ప్రాంతం అంతా తీవ్ర దుర్గంధం వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, మున్సిపల్ పాలకవర్గం చొరవ చూపి పూర్తయిన డంపుయార్డును వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రైస్‌మిల్లుల్లో సిబ్బందిని ఏర్పాటు చేయాలి: ఆర్డీవో


తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష

తూప్రాన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలులో అలసత్వం ప్రదర్శించవద్దని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డివిజన్‌లోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం మిల్లులకు చేరగానే త్వరగా అన్‌లోడ్ చేసేందుకు ఒక సిబ్బందిని పాయింట్ పర్సన్‌గా నియమించాలని సూచించారు. లారీల అన్‌లోడ్ వేగంగా, ఎప్పటికప్పుడు జరిగేటట్లు చూడాలన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతీ రైసుమిల్లులో ఒక పాయింట్ పర్సన్ ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రయాణికులకు చేరువలో ఆర్టీసీ సేవలు


ఉత్తమ సేవలందిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసిన ఉమ్మడి మెదక్‌జిల్లా డీఆర్‌ఎం

జహీరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు చేరువలోనే ఆర్టీసీ పనిచేస్తుందని డీఆర్‌ఎం జ్యోత్స్న పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీడిపోలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ సిబ్బంది ఆదాయం పెంచుకుని, ఖర్చును తగ్గించుకునేలా కృషిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ప్రయాణికులకు సౌకర్యంగా మారిందన్నారు. డ్రైవర్లు ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో మెరుగైన సేవలందిస్తున్న పలువురు సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదును అందజేశారు. అనంతరం ఆర్టీసీ డిపో, గ్యారేజ్‌లలో తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ జాకీర్‌హుస్సేన్, సీఐ ప్రసాద్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 12 వినతులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి 12 విజ్ఞప్తులు వచ్చాయని డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. శంకర్‌పల్లి మార్గంలో అదనపు బస్సులు నడపాలని శంకర్‌పల్లి నుంచి శేఖర్, వీరయ్యలు కోరారు. అదేవిధంగా చిద్రుప్ప అందూర్ మీదుగా బొంతపల్లికి బస్సు నడపాలని, కంగ్టి వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని, రాంసానిపల్లి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని పలువురు విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తులను పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం వివరించారు.

ఐక్యతతోనే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం


సంగారెడ్డిలో సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఏకతాటిపై ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ జావిద్‌అలీ సూచించారు. శనివారం సంగారెడ్డిలోని బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఫోరం సర్వసభ్య సమావేశం నిర్వహించగా, పలువురు ఉద్యోగుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జావిద్‌అలీ మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యంగా ఉండి సంఘం బలోపేతానికి కృషి చేయాలని, అందరూ కలిసి పనిచేసినప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం సులభతరమవుతుందన్నారు. అనంతరం ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం, యాదవరెడ్డి, ఇంటర్మీడియట్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకానికి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 'ధాన్యం తూకం ఆలస్యం రైతుల నిరసన' అన్న వార్త 'ఆంధ్రజ్యోతి' పత్రికలో శనివారం ప్రచురితం కావడంతో డీఎం హరికృష్ణ స్పందించారు. మండల పరిధిలోని గంగయ్యపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారు. డీఎం ఆదేశాల మేరకు సీఈవో మధుయాదవ్ ధాన్యాన్ని పరిశీలించి మాశ్చర్ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

పాలటలో ఉచిత వైద్య శిబిరం

మనోహరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం పాలట గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్, ముక్కు, గొంతు, ఇతర సమస్యలకు సంబంధించి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చర్మవ్యాధులు, మోకాళ్ల నొప్పులు, నడుము, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న 22 మందిని ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. శిబిరంలో 105 మందికి పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనర్సింహులు, వైద్యులు, మేఘన, దుర్గ, కార్తీక, కుమారస్వామి, సంజయ్, శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్ సేఫ్టీపై అవగాహన

సంగారెడ్డి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో సేఫ్టీ క్లినిక్‌ను శనివారం నిర్వహించారు. హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు జిన్నా మురళీధర్‌రెడ్డి ఎల్‌పీజీ గ్యాస్ ఉపయోగాలు, వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సుమారు 100 మంది విద్యార్థినులకు గ్యాస్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'వీర్‌శెట్టి పటేల్ సేవలు చిరస్మరణీయం'

నాగల్‌గిద్ద, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాగల్‌గిద్దకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీర్‌శెట్టి పటేల్ కాంగ్రెస్‌కు చేసిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం పటేల్ ప్రథమ వర్ధంతిని కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్ఠకు వీర్‌శెట్టి పటేల్ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వీర్‌శెట్టి కుమారుడు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శంకరయ్యస్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండేరావుపాటిల్, విఠల్‌రావు, సంజుపటేల్, నర్సుగొండ పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని వల్లూరు మాజీ సర్పంచ్ విఠల్ రెండురోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందడంతో చంద్రశేఖర్‌రెడ్డి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

సర్వం సిద్ధం...

(5వ పేజీ తరువాయి)

అమలులో ఉండనుంది. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నది.

విధుల్లో సిబ్బంది

పరీక్ష నిర్వహణలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 15 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఐడెంటిఫికేషన్ ఆఫీసరులు 157 మంది, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు 119 మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు 49 మంది, రూట్ ఆఫీసర్లు 9 మందిని నియమించారు. మెదక్ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరుగురు, రూట్ ఆఫీసరులు ఆరుగురు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లు, చీఫ్ సూపరింటెండెంట్ 19 మంది చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు.

అభ్యర్థులకు సూచనలు

హాల్‌టికెట్‌పై ఫొటో సరిగ్గా లేకపోతే మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకురావాలి. వీటిని పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. బయోమెట్రిక్ హాజరు నమోదు ఉండటంతో మెహందీ, టాటూలో వేసుకోవద్దు. పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు హాల్‌ను విడిచి వెళ్లేందుకు అనుమతించరు. సెల్‌ఫోన్, చేతిగడియారాలు, క్యాలిక్యులేటర్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్ రాహుల్‌రాజ్

గ్రూప్-3 పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం మెదక్‌లోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసరులు, రూట్ అధికారులు, అబ్జర్వర్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా మెదక్ 12, నర్సాపూర్ 3, తూప్రాన్ 2, రామాయంపేట 2 చొప్పున మొత్తం 19 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సిబ్బందితోపాటు అభ్యర్థులను క్షుణ్ణంగా పరీక్షించాకే లోపలకు పంపుతామన్నారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజేషన్ వంటివి చేపట్టాలన్నారు.

కార్తీక పూజలతో ఆధ్యాత్మిక సందడి



ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో శ్రీరామశిల ఊరేగింపు, నారాయణఖేడ్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సంగారెడ్డి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో రెండవ రోజు శనివారం నిర్వహించిన నవాయతన శ్రీరామ యాగ మహోత్సవంలో భాగంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ యాగంలో భాగంగా గణపతి పూజ, గురుపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగ మహోత్సవానికి హాజరైన భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ప్రశాంత్‌కుమార్, సాయి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని భూమయ్య కాలనీలోని శివపంచాయతన అభయాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విశేష అభిషేకం, సహస్రనాగవల్లి దళార్చక, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఖేడ్‌పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవంతో పాటు దీపోత్సవ కార్యక్రమాన్ని, కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఖేడ్ మండలంలోని కొండాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. ఖేడ్ ప్రాంత భక్తులే కాకుండా కర్ణాటక ప్రాంతం వారు, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి తరలి వచ్చారు.

● తూప్రాన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో వెలసిన శ్రీ అయ్యప్ప ఆలయంలో ఆదివారం మండలపూజ మహోత్సవం, నిత్యాన్నప్రసాద వితరణ ప్రారంభించారు. అయ్యప్ప ఆలయంలో నేతి మహేశ్వర్ గురుస్వామి సహకారంతో ఆదివారం నుంచి జనవరి 11 వరకు నిత్య అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. గురుస్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, గణపతి హోమం, అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు.

వేర్వేరు ఘటనల్లో గాయపడి.. చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

గుమ్మడిదల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామంలో నివాసముంటున్న అనిల్(25) అనే వ్యక్తి ఈ నెల 15న ద్విచక్ర వాహనంపై గుమ్మడిదల నుంచి అన్నారం గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో మొల్ టెక్ పరిశ్రమ సమీపంలోకి చేరుకోగానే అతివేగంగా లారీ వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడి భార్యకు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. భార్య చిన్నారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మరో ఘటనలో.. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద శుక్రవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో పోలంపల్లి గ్రామానికి చెందిన రమేష్, సూరారం గ్రామానికి చెందిన గజం కిషన్(60) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు మెదక్ అసుపత్రికి తరలించగా, గజం కిషన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

యువకుడి అదృశ్యం


కోటంగారి రాజు

టేక్మాల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టేక్మాల్‌లో ఓ యువకుడు అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని దాదాయిపల్లి గ్రామానికి చెందిన కోటంగారి రాజు (23) హైదరాబాద్‌లో చదువుకుంటున్నాడు. మూడు నెలల క్రితం ఇంటికి వచ్చాడు. ఈ నెల 13న పొలంలో మందు పిచికారి చేసేందుకు వెళ్లి సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ దొరకలేదు. తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి


కొంగటి యాదగిరి, వెంకట్‌రామ్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) నూతన మెదక్ జిల్లా అధ్యక్షుడిగా కొంగటి యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక టీఎన్జీవో భవన్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, గోపాల్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, విఠల్‌రెడ్డి ప్రభాకర్, లక్ష్మణ్, జిల్లా కార్యదర్శులుగా సాయిబాబా, పద్మ, నసీరొద్దీన్, రాజయ్య, సురేందర్, దేవీసింగ్, శ్రీనివాస్, జాదవ్, ఉమామహేశ్వర్‌రాజు, రాష్ట్ర కౌన్సిలర్లుగా సంగయ్య, హీరాలాల్, సంగీత, రాజేంద్రప్రసాద్, నజీరొద్దీన్, రమేష్, రజిత తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వ్యవహరించారు.

పౌరాణిక క్విజ్‌లో విద్యార్థులకు రాష్ట్రస్థాయి బహుమతి


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

తూప్రాన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాహితీ జిగీష ఫౌండేషన్ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పౌరాణిక క్విజ్‌లో తూప్రాన్ గీతాస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు తెలిపారు. గత నెలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామాయణ, మహాభారత, భాగవత పురాణాల్లో ప్రశ్నలతో క్విజ్ నిర్వహించగా. క్విజ్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి సీహెచ్ అక్షర, 9వ తరగతి విద్యార్థి సీహెచ్ సహస్ర రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం నిలిచినట్లు వివరించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీవేత్త పులిగడ్డ విజయలక్ష్మి ప్రశంసా పత్రంతోపాటు, రూ. వెయ్యి నగదు బహుమతి అందజేశారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

పెద్దశంకరంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పెద్దశంకరంపేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి పెద్దశంకరంపేటలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోజాగిరి పౌర్ణిమ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సనాతన ధర్మాన్ని మన సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన వివరించారు. మాణిక్‌ప్రభు మందిరంలో కార్తీక దీపోత్సవం ప్రత్యేకంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సుభాష్‌గౌడ్, పాఠశాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాదిగారి గంగాధర్, క్రాంతిలాల్, శిశుమందిర్‌త ప్రబంధకారిణిసభ్యులు, స్వయంసేవకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాందేడ్ ఎన్నికల ప్రచారంలో జహీరాబాద్ ఎంపీ


ఎన్నికల ప్రచార సభలో వేదికపై మంత్రి ఉత్తం, ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు నాందేడ్ పార్లమెంట్ స్థానానికి నిర్వహిస్తున్న ఉప ఎన్నికల్లో భాగంగా నాందేడ్‌తో పాటు ఆ జిల్లాలోని ముఖ్కేడ్‌లో శనివారం మహా వికాస్ అఘాడీ ప్రచార సభను నిర్వహించారు. సభలో జహీరాబాద్ ఎంపీ, నాందేడ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సురేష్ షెట్కార్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్య, తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి, తదితరులతో కలిసి పాల్గొన్నారు.

భక్తిభావనతో మానసిక ప్రశాంతత

జహీరాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భక్తిభావనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి డా. చంద్రశేఖర్, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలంలోని ఔరంగనగర్ గ్రామ సమీపంలో గల హజ్రత్ సిద్దపీర్‌దర్గా వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన ఉత్సవాల్లో వారు పాల్గొని మాట్లాడారు. హజ్రత్ సిద్ద పీర్ దర్గాను దర్శించుకుంటే ఎంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. ఏటా ఈ ఉత్సవాలు నిర్వహించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్గాలో దర్శనం చేసుకున్నారు.దర్శనార్థమై వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


హజ్రత్ సిద్ద పీర్ దర్గావద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సిద్దం ఉజ్వల్‌రెడ్డి